
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

గురువారం 7 ఆగస్టు 2025



పేదలపై వరాల జల్లు

- 'స్త్రీ శక్తి'తో 60వేల మందికి లబ్ధి
- జిల్లాలో 5,34,234 రేషన్‌కార్డులు
- నాయీబ్రాహ్మణులకు అండగా..

నంద్యాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలపై వరాలు జల్లులు కురిపిస్తోంది. ఇప్పటికే తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ.. దీపం-2, అన్నా క్యాంటీన్లు, ఎన్టీఆర్ భరోసా తదితర పథకాలను అమలు చేసి రూ. కోట్ల ఖర్చుచేసి మాట నిలబెట్టుకుంది. సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలకు ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేశారు.

ఆగస్టు15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం..

సూపర్-6 హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ మేరకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు.. ట్రాన్స్‌జెండర్లకు ఆగస్టు15వ తేదీ నుంచి 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. జిల్లాలో ప్రస్తుతం ప్రతి రోజు ఆర్టీసీ బస్సుల్లో 1.20 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుండగా. వీరిలో 50శాతం మంది మహిళా ప్రయాణికులు ఉన్నట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. ఈ లెక్కన.. రోజుకు ఉచిత ప్రయాణంతో ప్రతి రోజు 60 వేల మందికి పైగా ప్రయాణం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలు గు, సీటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ సదుపాయం కల్పించారు. ఇదే తరుణంలో జిల్లాలోని ఏడు ఆర్టీసీ డిపోల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.



నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు...

గతంలో మాదిరిగా కాకుండా కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు మరింత అండగా నిలిచింది. నాయీబ్రాహ్మణులకు 150 యూనిట్ల నుంచి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తూ కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. జిల్లాలోని వేలాది మంది నాయీబ్రాహ్మణులకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కలగనుంది. దీంతో ఆయా వర్గాల్లో ఆనందోత్సవం మొదలైంది.

ఆగస్టు 25న రాష్ట్ర వ్యాప్తంగా..

ఆగస్టు25న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సరికొత్త రేషన్ కార్డులను మంజూరు చేయనుంది. జిల్లాలోని 5,34,234 రేషన్‌కార్డులు ఉండగా.. వీరందరికీ కూడా ప్రభుత్వం ఆగస్టు25వ తేదీ నుంచి ఆయా కుటుంబ సభ్యులకు సరికొత్త రేషన్‌కార్డులను అందజేయనుంది. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి కూడా కొత్త రేషన్‌కార్డులు వస్తాయా..? లేదా.. అనే సందేహాలు లేకపోలేదు.

కల్లుగీత కార్మికులకు పెద్దపీట

ప్రభుత్వం కొత్తబార్ల పాలసీకి శ్రీకారం చుట్టి కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. కల్లుగీత కార్మికులకు పెద్దపీట వేసింది. జిల్లాలో 22 బార్లు ఉండగా.. ఇందులో 10శాతం కల్లు గీత కార్మికులకు ఇవ్వనున్నారు. మరీ ప్రధానంగా 50శాతం రాయితీతో అవకాశం కల్పించడం గమనార్హం. అయితే జిల్లాలోని టూరిజం ప్రాంతాల్లో మరిన్ని బార్లు పెంచే అవకాశం ఉందని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. మద్యం దుకాణాల పరంగా చూస్తే.. జిల్లా వ్యాప్తంగా 110 మద్యం దుకాణాలు ఉండగా.. ఇందులో 10శాతం కల్లుగీత కార్మికులకు అవకాశం కల్పించడంతో జిల్లాలో 11 మద్యం దుకాణాలు కల్లుగీత కార్మికులకు ఇచ్చిన విషయం తెలిసిందే. ఏది ఏమైనా తాజా కేబినెట్ ఆమోదంతో జిల్లాలో వివిధ కొత్త బార్ల పాలసీ రావడంతో జిల్లాలోని ఔత్సాహికులతో పాటు కల్లుగీత కార్మికులకు శుభపరిణామంగా మారినట్లైంది.



పంచాయతీలో అవకతవకలపై విచారణ

- పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్
- సర్పంచ్ చెక్‌పవర్ రద్దు ● డీపీవో లలితాబాయి



మాట్లాడుతున్న డీపీవో లలితాబాయి

రుద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రుద్రవరం మేజరు పంచాయతీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపడుతున్నట్లు డీపీవో లలితాబాయి తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు అందడంతో కలెక్టరు ఐదుగురితో ప్రత్యేక కమిటీని నియమించారన్నారు. పంచాయతీ కార్యదర్శి సుబ్బారావును సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు లిచ్చి చెక్‌పవర్ రద్దుచేసి ఎంపీడీవో భాగ్యలక్ష్మికి చెక్‌పవర్ బాధ్యతలు అప్పగించారన్నారు. నిధుల దుర్వినియోగంపై క్షుణ్ణంగా పరిశీలన చేయడమే కమిటీ సభ్యుల లక్ష్యమన్నారు. ఈ కమిటీలో డీపీవోతో పాటు జిల్లా ఆడిటర్ మహేశ్వర్‌రెడ్డి, సీనియర్ ఆడిటర్ రాఘవేంద్ర, డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి అశ్వనికుమార్‌ను నియమించారన్నారు. నాలుగేళ్లలో జరిగిన కార్యకలాపాలపై క్యాష్ బుక్కులు, బిల్లులు, వోచర్లు, పారిశుధ్య కార్మికుల వేతనాలు, 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధుల ఖర్చుల వివరాలను క్షుణంగా పరిశీలిస్తామన్నారు. విచారణ పూర్తయ్యాక నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని డీపీవో తెలిపారు.

నిధుల స్వాహాపై..



విచారిస్తున్న విజిలెన్స్ బృందం

ఆత్మకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ రిటైర్డు అయిన చాంద్ బాషా చేసిన అవినీతి, అక్రమాలపై పీసీసీఎఫ్ నియమించిన విజిలెన్స్ బృందం బుధవారం విచారణ చేపట్టింది. ప్రత్యేకించి విజిలెన్స్ డీఎఫ్‌వో శివప్రసాద్, ఎస్ఎస్‌టీఆర్ సర్కిల్ ఆఫీసు అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి, కర్నూలు, నంద్యాల, ఆత్మకూరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు చంద్రశేఖర్, రవికుమార్, చంద్రశేఖరరాజు, సర్కిల్ ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ రమేష్, విజిలెన్స్ రేంజ్ ఆఫీసర్ శంకరయ్య, విజిలెన్స్ ఎఫ్‌బీవో జబీవుల్లాతో కూడిన బృందం డివిజన్ కార్యాలయంలో అవకతవలు జరిగిన అన్ని రికార్డులను పరిశీలించింది. ప్రత్యేకించి అటవీశాఖకు చెందిన ఏఏ నిధులు ఏవిధమైన అక్రమ మార్గాల్లో దారిమళ్లాయన్న వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తున్నారు. ఇందులో ఆయా విభాగాల అధికారుల అలసత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకునేందుకు మరిన్ని వివరాలను ఆధారాలతో సహా సేకరిస్తున్నారు. 2018 నుంచి అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా నినిర్ధా రించి ఏఏ రేంజుల్లో ఎంత మొత్తంలో అవకతవకలు జరిగాయన్న వివరాలను ఒక్కొక్కటిగా సేకరిస్తున్నారు. కాగా అటవీశాఖ నిధుల స్వాహాపై జరుగుతున్న విచారణ గురించి అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నట్లు విజిలెన్స్ బృందం సభ్యులు వెల్లడించారు.



నవీనతకు సాక్ష్యాలు.. చేనేతలు

- నేతన్నల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న వస్త్రాలు
- ఆకట్టుకునే డిజైన్లతో జరీ అంచు పట్టుచీరలు
- బర్డ్‌ఐ తువాళ్లు.. జిందగీ దుప్పట్లకు ఎమ్మిగనూరు ప్రత్యేకం

6

36 మంది సీఐల బదిలీ 7

నారుమడి.. సిద్ధం చేయండిలా

- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఎకరా వరి నాటుకు ఐదు సెంట్ల మడి
- నాణ్యమైన నారుమడితో అధిక దిగుబడులు

6

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో..

రైతులకు ప్రయోజనం లేదు

- ఇది కేవలం కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసమే
- విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు



గోరుకల్లు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం - బనకచర్ల ఎత్తిపోతల ప్రాజెక్టు కేవలం కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసమే అని, రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేదని ఆలోచనపరుల వేదిక నాయకుడు, విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ఆయన నంద్యాలలో రాయలసీమ సాగునీటిసాధన సమితి నాయకులు బొజ్జా దశరథరామిరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జీవనదులైన కృష్ణా, గోదావరి నదుల నీటిని పూర్తిస్థాయిలో వాడుకోవడం మన బాధ్యత అని అన్నారు. గత ప్రభుత్వం హయాంలోనే పోలవరం - బనకచర్ల ప్రాజెక్టును మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రతిపాదించగా వ్యాప్కోస్ నుంచి డీపీఆర్ కూడా పొంది కార్యాలయాల్లో నలిగిన ప్రాజెక్టు అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టును ఆనాడు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయని, అయితే నేటి కూటమి ప్రభుత్వం మళ్లీ అదే ప్రాజెక్టును తలపై ఎత్తుకుని ఢిల్లీ చుట్టూ తిరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్నా కూడా లేనట్లు ఉన్న ప్రధాన పార్టీ ఆ ప్రాజెక్టుపై నోరు మెదపడం లేదన్నారు. బనకచర్ల ప్రాజెక్టు రైతుల ప్రయోజనాలకు ఏ మాత్రం ఉపయోగం లేదని ఆలోచనాపరుల వేదిక నిర్ధారణకు వచ్చిన తర్వాత ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు తెలిపారు. కృష్ణానది నీటిని వీలైనంత మేరకు తరలించి రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశ్యం గత దశాబ్దాల నుంచి ఉన్నా, అనేక ప్రాజెక్టులు కట్టినా నేటికీ లక్షల ఎకరాలకు నీరు అందడం లేదని అన్నారు. ప్రభుత్వాలు తమ పరిశీలనలను పరిశీలిస్తాయో లేదో కానీ, ప్రజలకు వివరించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. సమావేశంలో సాగునీటిరంగ విశ్లేషకులు తుంగలక్ష్మీనారాయణ, రైతు సేవా అధ్యక్షుడు అక్కినేని భవానీప్రసాద్, సామాజికవేత్త రామారావు, సీపీఐ నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

గోరుకల్లు రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించాలి

పాణ్యం: గోరుకల్లు రిజర్వాయర్ రిపేరీ పనులకు రూ.53 కోట్లు ప్రతిపాదించారని, వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేసి రైతాంగానికి సాగునీరందించాలని ఆలోచనాపరుల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఆలోచనాపరుల వేదిక నాయకులు వెంకటేశ్వరరావుతో పాటు సాగునీటి రంగ విశ్లేషకులు తుంగ లక్ష్మీనారాయణ, రైతు సేవా అధ్యక్షుడు అక్కినేని భవానీ ప్రసాద్, సామాజికవేత్త రామారావు, చక్రవర్తి, సీపీఐ నాయకులు రామాంజనేయులు, బాబాఫక్రుద్దీన్, బొక్కం రామసుబ్బారెడ్డి, ఎస్సార్బీసీ పరిరక్షణ నాయకులు మురళీధరరెడ్డి, ఈశ్వరరెడ్డి, సమితి కార్యవర్గ సభ్యులు, రైతు నాయకులు రిజర్వాయర్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ సామర్థ్యం మేరకు నీటి నిల్వను చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనికి అవినీతి, అక్రమాలే కారణమని అన్నారు. నికరజలాల ఆధారంగా నిర్మించిన ఏకైక ప్రాజెక్టు గోరుకల్లు అని అన్నారు. 12కు పైగా టీఎంసీల నీటిని నింపుకోవాల్సిన రిజర్వాయర్‌ను అవినీతితో పది సంవత్సరాలు కాకముందే 8టీఎంసీల నీటిని నింపుకోవడం అన్యాయమన్నారు. రిజర్వాయర్ రాతిపరుపు జారిపోవడం, ఇంత వరకు రిపేరీలు పూర్తి కాకపోవడం రైతులకు శాపంగా మారిందన్నారు. ప్రభుత్వాల ఉదాసీనతే ఇందుకు కారణమన్నారు. ప్రపంచ నిధులతో వడ్డీలు చెల్లిస్తూ రైతులకు న్యాయం చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు.

ఆర్ అండ్ బీ రోడ్లకు మోక్షం

- రూ.2.20కోట్ల నిధులు మంజూరు
- త్వరలో టెండర్లు స్వీకరణ

నంద్యాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు మోక్షం లభించనుంది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఎండీఆర్ కింద నిధులు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని శ్రీశైలం నియోజకవర్గంలోని రెండు రోడ్లకు రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. పాములపాడు మండల పరిధిలోని మద్దూరు- వెలుగోడు మండల పరిధిలోని రేగడగూడురు మధ్యలోని ఐదు కిలోమీటర్లు తారురోడ్డును (బీటీరోడ్డు) ఆయా నిధులతో వేయనున్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి స్వగ్రామం వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామంలో 600 మీటర్లు దెబ్బతిన్న సిమెంట్‌రోడ్డును వేయనున్నారు. కొన్ని నెలలుగా ఆయా రోడ్లు అధ్వానస్థితిలో ఉండటంతో ఆయా రహదారుల గుండా రాకపోకలు సాగించడం ఇబ్బందిగా మారింది. గతంలో ఆయా రోడ్ల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు కూడా ప్రచురించిన విషయం తెలిసిందే. ఏది ఏమైనా తాజాగా ప్రభుత్వం ఆయా రోడ్లకు రూ.2.20కోట్లు నిధులు మంజూరు ఆ ప్రాంత వాసులకు రోడ్డు సమస్య తప్పనుంది. త్వరలోనే టెండర్లు స్వీకరించి త్వరిగతిన ఆయా రోడ్ల పనులను ఆశాఖ అధికారులు పూర్తి చేయనున్నారు.



అధ్వానంగా ఉన్న మద్దూరు-రేగడగూడూరు రోడ్డు



శివతాండవం నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అలరించిన నృత్య ప్రదర్శనలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో నిత్య కళారాధనలో భాగంగా రంగారెడ్డి జిల్లాకు చెందిన సుమేధజ్యోషి బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన నిర్వహించారు. నిత్య కళారాధనలో భాగంగా వినాయకకౌత్వం, శివాష్టకం, శివపార్వతీ కల్యాణం, నమశ్శివాయతే, శివతాండవం, భో శంభో, తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు.

రేపు సామూహిక వరలక్ష్మి వ్రతం

బేతంచెర్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్.రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మద్దిలేటిస్వామి క్షేత్రంలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాస సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు లక్ష్మీదేవి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, విశేష ద్రవ్య అభిషేకం, తిరుమంజనం, సహస్రనామ, అష్టోత్తర పారాయణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 గంటలకు అమ్మవారిని భాజాభజంత్రీల మధ్య వ్రతవేదిక వద్దకు స్వాగత కార్యక్రమం ఉంటుందన్నారు. 11 గంటలకు భక్తులు, మహిళల మధ్య వరలక్ష్మి వ్రత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొనే మహిళకు పూజా కార్యక్రమానికి దేవస్థానం కుంకుమ, కొబ్బరికాయ, రవిక, పూలు తదితర పూజా సామగ్రిని ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. పూజల్లో పాల్గొనే మహిళలు కేవలం ఒక ప్లేటు, రెండు గ్లాసులు, ఒక చెంబు మాత్రమే స్వయంగా తీసుకుని రావాలన్నారు. ఈ సందర్భంగా వీరికి ఆర్ఎస్ రంగాపురం నుంచి దేవస్థానం వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ఈరన్న స్వామి హుండీ లెక్కింపు

- నాలుగు రోజులకు రూ.92 లక్షల ఆదాయం
- డిప్యూటీ కమిషనర్ విజయరాజు



ఉరుకుందలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కౌతాళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవ స్థానంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా నాలుగు రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను దేవస్థానపు కాలక్షేపపు మండపం నగదు రూపంలో రూ.92,09,323 50 విదేశీ డాలర్లు, బంగారం19 గ్రాముల, 500మిల్లి గ్రాములు, వెండి 23కిలోల 100 గ్రాములు వచ్చినట్లు డీసీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు భక్తులు ఇలా తమవంతు సహకారాలు అందించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఆదోని గ్రూపు ఆలయ పర్యవేక్షులు, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధానఅర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి, శివన్న స్వామి, బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

చేయి తిరిగిన చేనేత కార్మికులు వారు.. వస్త్ర రంగంలో సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. నేతన్నల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న చేనేత వస్త్రాలు చిరకాలంగా గుర్తుండిపోతున్నాయి. అధునాతన డిజైన్లు.. సహజసిద్ధమైన రంగులు.. నవీనతకు సాక్ష్యాలుగా కర్నూలు జిల్లా నేతలు నిలుస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే సహకార రంగానికి పునాది వేసిన ఘనత ఎమ్మిగనూరు చేనేతలది. చెక్క మగ్గాలపై అందమైన తువాళ్లు, దుప్పట్లు, దోమ తెరలు, చీరలు, షర్టింగ్ వస్త్రాలు.. ఇలా వివిధ నూలు వస్త్రాలు జరీ అంచు పట్టుచీరలు తయారీలో వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. ప్రభుత్వం చేయూత అందిస్తే మగ్గాలపై అద్భుత వస్త్రాలు తయారు చేయగల నైపుణ్యం ఉంది. కూటమి ప్రభుత్వం నేత కార్మికులకు అండగా నిలుస్తూ.. మగ్గం కలిగిన ప్రతి నేతన్న కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే కీలక పథకానికి నేడు శ్రీకారం చుట్టనుంది. నేడు జాతీయ చేనేతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో చేనేత కార్మికుల నైపుణ్యం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఎమ్మిగనూరులో మగ్గాలపై చేనేత వస్త్ర ఉత్పత్తుల్లో నిమగ్నమైన నేత కార్మికుడు



నవీనతకు సాక్ష్యాలు.. చేనేతలు

- నేతన్నల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న వస్త్రాలు
- ఆకట్టుకునే డిజైన్లతో జరీ అంచు పట్టుచీరలు
- బర్డ్సై తువాళ్లు.. జిందగీ దుప్పట్లకు ఎమ్మిగనూరు ప్రత్యేకం
- మగ్గం ఉన్న చేనేతకు నేటి నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- నేడు అంతర్జాతీయ చేనేత దినోత్సవం

కర్నూలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేనేతరంగం అంటే గుర్తుకొచ్చేది ఎమ్మిగనూరు. చేనేత పితామహుడు పద్మశ్రీ మాచాని సోమప్ప 1938లో 'ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం లిమిటెడ్‌ను స్థాపించారు. స్వాతంత్ర్యానికి ముందే సహకార వ్యవస్థకు పునాది వేశారు. దేశంలోనే అత్యుత్తమ చేనేత వస్త్ర ఉత్పత్తి బ్రాండ్‌గా మారింది. దుప్పట్లు (బెడ్‌షీట్లు), తువాళ్లు, లుంగీలు, చేతి రుమాలు, దోమతెరలు, షర్ట్ దుస్తులు, దోతీలు, చీరలు.. వంటి వివిధ రకాల చేనేత వస్త్ర ఉత్పత్తులకు నిలయమై చేనేతపురిగా ఖ్యాతి సొంతం చేసుకుంది. బర్డ్సై తువాళ్లు.. జిందగీ దుప్పట్లు ఎమ్మిగనూరు ప్రత్యేకం. ఆ తరువాత ఆదోని, కోడుమూరు, నందవరం, నాగులదిన్నె, గుడేకల్లు, పత్తికొండ, కర్నూలు, గోనెగండ్ల, వెల్దుర్తి వంటి ప్రాంత్రాల్లో చేతి మగ్గాలపై ఆధారపడి జీనవం సాగిస్తున్న దాదాపు 15 వేలకు పైగా చేనేత కార్మికులు కుటుంబాలు ఉన్నాయి. 14 చేనేత సహకార సంఘాలు ఉంటే ఒక్క ఎమ్మిగనూరు సహకార సంఘం ఒక్కటే నేతన్నలకు అండగా నిలుస్తూ ఉపాధి కల్పిస్తుంది. సహకార రంగంలో 1,039 కుటుంబాలు, సహకారేత రంగంలో 2,301 కుటుంబాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా అంతకంటే ఎక్కువ కుటుంబాలు చేనేత వస్త్ర ఉత్పత్తిపై ఆధార పడుతున్నారు.

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సొంత మగ్గం కలిగిన చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, మర మగ్గం ఉంటే 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది తరువాత ఈ పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు జాతీయ చేనేతల దినోత్సవాన్ని పురష్కరించుకొని ప్రారంభించనున్నారు. కర్నూలు జిల్లాలో 2,457 చేనేత కుటుంబాలు, నంద్యాల జిల్లాలో 385 కుటుంబాలు 200 యూనిట్లు ఉచితకు అర్హులుగా గుర్తించారు. ఒక్కో చేనేత కుటుంబానికి నెలకు రూ.1,200 ప్రకారం ఏడాది రూ.14 వేల నుంచి రూ.15 వేలు ఉచిత విద్యుత్ రూపంలో ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. మర మగ్గాలు కలిగిన కర్నూలు జిల్లాలో ఒకరికి, నంద్యాల జిల్లాలో 73 మందికి 500 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్ అందించనున్నారు. అలాగే.. కర్నూలు జిల్లాలో 3,611 మంది, నంద్యాల జిల్లాలో 985 మంది 50 ఏళ్లు పైబడిన చేనేత కార్మికులకు నెలకు రూ.4 వేలు చొప్పున పింఛన్ అందుతుంది.



చేనేతల ఉత్పత్తులు

45 ఏళ్లుగా మగ్గంపై ఆధారపడి జీవిస్తున్నాం



చేనేత వృత్తే మాకు జీవనాధారం. పోగులు వడికి పేగు నింపుకునే జీవితాలు మావి. 45 ఏళ్లుగా మగ్గంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. శ్రమకు తగిన కూలీ రావడం లేదు. మగ్గంపై నేత నేయడం తప్ప మరో వృత్తి తెలియదు. కష్టమైనా నష్టమైనా మగ్గమే ఆధారం. ఒక దుప్పటి నేస్తే రూ.150 ఇస్తున్నారు. రోజుకు రెండు దుప్పట్లు నేయడం కష్టమే. అంటే.. రోజంతా కష్టపడినా రూ.250 కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి. ఒకప్పుడు ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘంలో రూ.2 వేలకు పైగా చేనేత కార్మికులు జీవనం సాగించారు. ప్రస్తుతం 450 మంది కూడా లేరు. వారిలో సగం మంది కూడా మగ్గం నేయడం లేదు. మా తర్వాతి తరం మగ్గం నేసేందుకు ఆసక్తి చూపడం లేదు. మర మగ్గాల పోటీ కూడా తట్టుకోలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు చేయూతను అందించి చేనేతలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. నిర్లక్ష్యం చేస్తే చేనేత మగ్గం కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు.

- కనికె మల్లికార్జున, చేనేత కార్మికుడు, ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం, ఎమ్మిగనూరు

జిల్లాలో చేనేతల వివరాలు

- చేనేత సహకార సంఘాలు : 14
- యాక్టివ్ సంఘాలు : 1 (ఎమ్మిగనూరు)
- సహకార రంగంలో సభ్యులు: 1,039
- సహకారేతర రంగంలో సభ్యులు : 2,301
- ఏ పట్టణంలో ఎందురు: ఎమ్మిగనూరు-1,430, కోడుమూరు -770, ఆదోని-330



2015 ఆగస్టు 7న తొలి జాతీయ చేనేత దినోత్సవం

భారతదేశ వైవిధ్యమైన సంస్కృతి, వారసత్వానికి చిహ్నం చేనేత రంగం. వ్యవసాయం తరువాత పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పిస్తున్న చేనేత వృత్తి. స్వాతంత్ర్య పోరాటంలో జాతిపిత మహాత్మాగాంధీ చేనేత చరక పట్టుకుని ఉద్యమ స్పూర్తి రగలించారంటే ఆ రోజుల్లో ఈ రంగం ఏ స్థాయిలో ఉందో ఇట్టే తెలుస్తుంది. చేనేత, అనుబంధ నేత రంగాల్లో 70 శాతం కంటే ఎక్కువ శాతం ఆధారపడింది మహిళలే. 1905 ఆగస్టు 7న ప్రారంభించిన స్వదేశీ ఉద్యమం దేశీయ పరిశ్రమలను, ముఖ్యంగా చేనేత కార్మికులను స్పూర్తి, ప్రోత్సాహం ఇచ్చింది. అందుకే ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించాలని 2015లో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2015 ఆగస్టు 7న ప్రథమ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రధాని మోడీ చెన్నైలో ప్రారంభించారు.

చేనేత దినోత్సవానికి ఏర్పాట్లు చేశాం



ఎమ్మిగనూరులో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ నేడు సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. కర్నూలు జల్లాలో 2,457 చేనేత కుటుంబాలు, నంద్యాల జిల్లాలో 385 కుటుంబాలు అర్హులుగా గుర్తించాం. ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్క్ కోసం వివిధ పనుల కోసం ప్రాథమికంగా రూ.30.71 కోట్లు అవసరమని అంచనా వేశాం. త్రిఫ్ట్ ఫండ్, నూలు రాయితీ వంటి నిధులు మంజూరయ్యాయి.

- నాగరాజు యాదవ్, ఏడీ, ఏపీ చేనేత, జౌళి శాఖ, కర్నూలు

నేతన్నలకు అండగా ప్రభుత్వం

ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రం వద్ద 77 ఏకరాల్లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. రూ.43 కోట్లలో వివిధ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- చేనేత సమీకృత కార్యక్రమం (సీడీపీ) రెండో విడతలో పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. నిధులు మంజూరు అయితే ఎమ్మిగనూరు క్లస్టర్‌లో 251, ఆదోని క్లస్టర్‌లో 233 మంది చేనేత కార్మికులకు మగ్గాలు, మగ్గం పరికరాలు మంజూరు అవుతాయి.
- ఎమ్మిగనూరులో 'వీవర్స్ శాల' ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యరూపం దాలిస్తే అధునాతన మగ్గాలు, వార్పింగ్, డైయింగ్, సైజింగ్.. అన్ని ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. వీవర్స్ శాల నిర్మాణం కోసం ఎకరం భూమి అవసరం కాగా.. ఆదోని సబ్ కలెక్టర్ ఏపీ టిడ్కో హౌసింగ్ కాలనీలో 86 సెంట్లు స్థలం గుర్తించి కలెక్టరుకు నివేదిక పంపారు. అవసరమైన నిధులు రూ.1.20 కోట్లు ఎంపీ ల్యాండ్ నుంచి ఇచ్చేందుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పష్టమైన హామీ ఇచ్చారు.
- నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) నుంచి కొనుగోలు చేసిన నూలుపై 20 శాతం రాయితీ 2021-22కు ఎమ్మిగనూరు రూ.25.38 లక్షలు ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘానికి విడుదల చేశారు. 236 మంది చేనేతలకు ప్రయోజనం కలుగనుంది.
- చేనేత సహకార సంఘాల్లో పని చేసే కార్మికులకు ఆర్థిక చేయూత కోసం 2019లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం 'త్రిఫ్ట్ నిధి' అమలులోకి తెచ్చింది. నేత కార్మికుడు రోజువారి వేతనంలో 8 శాతం చెల్లిస్తే, ప్రభుత్వం 16 శాతం చేర్చి త్రిఫ్ట్ నిధి ఖాతాకు జమ చేస్తుంది. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘానికి ఒక్కటే రూ.18 లక్షలు మంజూరు చేశారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూత

- జిల్లాలో 14 సహకార సంఘాలు
- 3,611 మంది చేనేత కార్మికులకు నెలకు రూ.4 వేలు పింఛన్
- చేనేత సహాయ సంచాలకుడు రాజారావు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కర్నూలు జిల్లా చేనేత శాఖ సహాయ సంచాలకుడు జి.రాజారావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని చేనేత, జౌళి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, గడేకల్, నాగులదిన్నె, కోసిగి, గూడూరు ప్రాంతాల్లో చేనేత పరిశ్రమ విస్తరించి ఉందని, జిల్లాలో 14 సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. చేనేత కార్మికుల అభివృద్ధి కోసం ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం జరుగుతోందని, నెలకు 200 యూనిట్ల విద్యుత్ రాయితీని అందిస్తున్నామన్నారు. 2,457 చేనేత కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మరమగ్గాల ద్వారా వస్త్రాలు తయారు చేసే వారికి నెలకు 500 యూనిట్ల విద్యుత్ అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో 3,611 మంది చేనేత కార్మికులకు నెలకు రూ.4వేల చొప్పున పింఛన్ అందిస్తున్నామని, దీని కోసం రూ.1.44 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ముద్ర పథకం ద్వారా 166 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి 50వేల చొప్పున రూ.83లక్షలు మంజూరు చేశారన్నారు. కలెక్టర్ ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు కోసం 77 ఎకరాల ఖాళీస్థలాన్ని ఏపీఐఐసీ వారికి అందించారన్నారు. మే 6వ తేదీన చేనేత, జౌళిశాఖ మంత్రి టెక్స్‌టైల్ పార్కు యొక్క శిలాఫలకాన్ని ఆవిష్కరించారని, త్వరలోనే సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారు చేసి జిల్లాలోని చేనేతలకు ఉపాధి అవకాశాలు పెంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.

వయోవృద్ధుల సంక్షేమం కోసం చట్టం

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు, తల్లిదండ్రుల నిర్వహణ, సంక్షేమం కోసం సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టంను ప్రవేశపెట్టారని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం-2007 అమలుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆర్థికస్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలు సంరక్షించని పక్షంలో మెయింటెనెన్స్ కోసం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ లేదా ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జిల్లాలో 15 వృద్ధాశ్రమాలు ఉన్నాయని, వాటిని జిల్లా అధికారులు విజిట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఆర్డీవోలు సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

12న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జాతీయ నులి పురుగుల నిర్మూలనపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నులి పురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని స్కూల్ పిల్లలు, కాలేజీ విద్యార్థులకు నుటి పురుగుల నివారణ ఆవశ్యకత గురించి పూర్తి అవగాహన కల్పించి 1-19 సంవత్సరాల వయస్సు వారికి అల్బెండజోల్ మాత్రలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఈ మాత్రలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శాంతికళ, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి

మంత్రాలయం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఈశ్వరప్ప కుటుంబ సమేతంగా బధవారం సాయంత్రం మంత్రాలయానికి వచ్చారు. ఆయనకు ఆలయ మహ ముఖద్వారం వద్ద శ్రీ మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. హెచ్‌పీఐఎల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ గిరీష్ కనకవీడు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రీనాథ్, ఎస్ఐ శివాంజల్, వ్యాసరాజ ఆచార్ పాల్గొన్నారు.



ఈశ్వరప్పను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి

నారుమడి.. సిద్ధం చేయండిలా

శిరివెళ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కేసీ కెనాల్, తెలుగుగంగ, కుందూ, ఎల్లెల్సీ తదితర కాల్వల నీరు ప్రధాన వనరుగా పంటలు సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. రైతులు అధికంగా సాగుచేసే వరి పైరుకు ముందు నారుమడి తయారీలో యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో నారుమడి తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధానాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఎకరా వరి నాటుకు ఐదు సెంట్ల మడి
- నాణ్యమైన నారుమడితో అధిక దిగుబడులు

నారుమడి తయారీ

ఎకరా పొలంలో వరి నాట్లు వేయడానికి గాను ఐదు సెంట్ల నారుమడి సరిపోతుంది. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నారుమడికి నీరు పెట్టేందుకు, నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా చిన్న చిన్న కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో పోటాష్, కిలో భాస్వరం చొప్పున ఎరువులను దుక్కిలో వేయాలి. ఎంపిక చేసుకున్న నాణ్యమైన విత్తనాలను 24 గంటల పాటు నీళ్లలో నానబెట్టి బయటకు తీసి మరో 24గంటల పాటు మండె కట్టి ఉంచాలి. ఆ తర్వాత మొలకలు వచ్చిన విత్తనాలను ఒక సెంటుకు 5 నుంచి 6 కిలోల చొప్పున మడిలో చల్లుకోవాలి. నారు మొలకెత్తే సమయంలో ఆరుతడులు ఇచ్చి తర్వాత నీరు పలుచగా కట్టుకోవాలి. మడిలో నీరు ఎక్కువైతే నారు కుళ్లిపోయే ప్రమాదం ఉంది.

నారుమడిలో సస్యరక్షణ

నారుమడిలో సస్యరక్షణ చేపట్టడం ద్వారా నాణ్యమైన వరి నారు లభిస్తుంది. మొదటగా విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయడం ద్వారా తెగుళ్లను సమర్థవంతంగా నివారించే బలం చేకూరుతుంది. కిలో వరి విత్తనానికి మూడు గ్రాముల కార్బండైజిమ్‌ను కలిపి 24 గంటల తర్వాత మడిలో చల్లుకోవాలి. నారుమడిలో జింక్ లోపాన్ని గుర్తిస్తే లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. జింక్‌ను ఇతర మందులతో కలుపకూడదు. మడిలో అగ్గి తెగులు నివారణకు లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా రెండు మిల్లీ లీటర్ల కాసుగామైసిన్ కలిపి పిచికారీ చేయాలి. నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు ఒక సెంటుకు 160 గ్రాముల చొప్పున వేయాలి. నారు నాటే ముందు వేర్లను 50 లీటర్ల నీటిలో 100 ఎంఎల్ క్లోరిపైరిఫాస్, 2.5 కిలోల యూరియాను కలిపిన ద్రావణంలో దాదాపు అరగంట సేపు ఉంచి నాటుకుంటే పంటలో చీడపీడలు నివారించబడతాయి.



రైతులు సాగు చేసిన వరి నారుమడి

విత్తన శుద్ధి చేయాలి



వరి పైరు సాగు చేసేందుకు నారుమడి సిద్ధం చేసే సమయంలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. నాణ్యమైన నారుతో మంచి దిగుబడులు వస్తాయి. మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తే దిగుబడులపై ప్రభావం చూపుతుంది. నారుమడిలో యాజమాన్య పద్ధతులపై గ్రామాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందితో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- సుధాకర్, వ్యవసాయాధికారి, శిరివెళ్ల

సమష్టి కృషితో కళల నిలయంగా తీర్చిదిద్దుదాం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రం నూతన కమిటీ ఎన్నిక



టీజీ వెంకటేశ్, జి. పుల్లయ్య, బీవీ రెడ్డి, కేఎస్‌వీ రాజశేఖర్‌తో నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు, సభ్యులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో టీజీవీ కళాక్షేత్రాన్ని కళల నిలయంగా తీర్చిదిద్దుదామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కళాకారులకు పిలు పునిచ్చారు. బుధవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కళాక్షేత్రం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 150మందికి పైగా శాశ్వత సభ్యులు, కవులు, కళాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఎక్కడ అభివృద్ధి ఉంటుందో అక్కడ విమర్శలు కూడా సహజమేనన్నారు.

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఈకళాక్షేత్రం కళలు, సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోందని, రాబోయే కాలంలో మరిన్ని నిధులు కేటాయించి నిత్యకల్యాణం పచ్చతోరణంగా తీర్చిదిద్దుతామన్నారు. టీజీవీ కళాక్షేత్రం కళాకారులకు ఉపయోగకరంగా నిలవాలని, అందుకు కొత్త కమిటీ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అవసరమైతే రాబోయే ఆరు నెలల్లో కమిటీల్లో మార్పుచేర్పులు ఉంటాయని హామీ ఇచ్చారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ టీజీ వెంకటేశ్ సహకారంతో, సూచనలతో కళాక్షేత్రంలో నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేలా కార్యాచరణతో ముందుకు పోతున్నామని చెప్పారు. గౌరవ అతిథులుగా విచ్చేసిన రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, పారిశ్రామికవేత్త, బ్రహ్మరిషి బీవీ రెడ్డి, మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్ మాట్లాడుతూ కర్నూలులో టీజీ వెంకటేశ్ ఎంతో శ్రమించి నిర్మించిన కళాక్షేత్రం రాయలసీమలోనే అతిపెద్ద ఆడిటోరియంగా నిలిచిపోతోందని చెప్పారు. కళాకారులు ఈ క్షేత్రాన్ని ముందుకు తీసుకుపోవడంలో కృషి చేయాలని కోరారు.

నూతన కమిటీని ప్రకటించిన టీజీ వెంకటేశ్

ఈ ఏడాది మార్చి 31 వరకు ఉన్న కళాక్షేత్రం వార్షిక నివేదికను కళాక్షేత్రం మేనేజర్ బాషా తెలియజేశారు. అనంతరం టీజీవీ కళాక్షేత్రం నూతన కమిటీని టీజీ వెంకటేశ్ ప్రకటించారు. కళాక్షేత్రం చీఫ్ అడ్వైజర్లుగా జి. పుల్లయ్య, డాక్టర్ బీవీ రెడ్డి, కేఎస్‌వీ రాజశేఖర్‌ను ప్రకటించారు. కళాక్షేత్రం అధ్యక్షుడిగా మరోసారి కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా యాగంటీశ్వరప్ప నియమితులయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాలవెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా దాశెట్టి శ్రీనివాసులు, ఎస్. మహమ్మద్‌మియా, కోశాధికారిగా కె.రామస్వామి, సంయుక్త కార్యదర్శులుగా సంగా ఆంజనేయులు, ఎస్ఎండీ ఇనాయతుల్లా, కె. శివయ్య, ఈసీ మెంబర్లుగా కేవీ రమణ, డి. ఈశ్వరయ్య, కె. రమేష్, గాండ్ల లక్ష్మన్న, పి. రాజారత్నం, పీపీ గురుమూర్తి, సీఎస్ మద్దయ్య, రాముడు, జీవీ శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఈ కమిటీకి సలహా దారులుగా సీవీ రెడ్డి, బలరాం, పాండురంగయ్య ఎన్‌డీ క్రిష్టఫర్, ఎన్‌కే లక్ష్మీకాంతారావు నియమితులయ్యారు.



పత్తి ఓబులయ్య



యాగంటీశ్వరప్ప

పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్తూ..

- అనంతలోకాలకు తండ్రి
- బైక్‌ను ఢీకొట్టిన మినీ బస్సు



వెంకటరమణ (ఫైల్)

ఓర్వకల్లు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్తూ ఓ వృద్ధుడు అనంతలోకాలకు చేరాడు. ఈ ఘటన మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై సోమయాజులపల్లె గ్రామానికి సమీపంలో గల బేతంచెర్ల యూటర్న్ వద్ద చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. సోమయాజులపల్లెకి చెందిన వెంకట రమణ(65) తన కుమారుడు మధుబాబు పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు బుధవారం చెన్నంచెట్టిపల్లె గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. గ్రామానికి సమీపంలో యూటర్న్ వద్ద దాటుతుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న మినీ బస్సు ఢీకొనడంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల ఘటనాస్థలికి చేరుకొని శోకసంద్రంలో మునిగి పోయారు. మృతుని కుమారుడు మధుబాబు వివాహం ఈనెల 13, 14 తేదీల్లో జరగాల్సి ఉంది. మృతుడికి ఐదు మంది కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హెల్త్ అసిస్టెంట్లకు రీడిప్లాయిమెంటు

- ఉత్తర్వులు జారీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న ఐదు మంది హెల్త్‌అసిస్టెంట్లు (మేల్)లను రీడిప్లాయిమెంటు చేస్తూ కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ ఉత్తర్వులు జారీ చేశారు. మే నెలలో ఉమ్మడి జిల్లాలోని 40 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్)లను ఏ జిల్లా పరిధిలో ఉన్న ఉద్యోగులను అదే జిల్లాలో కౌన్సెలింగ్ నిర్వహించి రీడిప్లాయిమెంటు చేశారు. రెండు నెలలు కాక ముందు ఎస్‌వీ బీడీసీ కింద ఐదు మంది హెల్త్ అసిస్టెంటను రిడిప్లాయిమెంటు చేశారు. చిన్నరాముడు నంద్యాల జిల్ల బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ నుంచి కర్నూలు రోజా-2 అర్బన్ హెల్త్ సెంటర్‌కు, ఎస్.అనిల్ కుమార్ స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ కర్నూలు నుంచి నందికొట్కూరు యూపీహెచ్‌సీకి, ఎం.వెంకటస్వామి నందికొట్కూరు యూపీహెచ్‌సీ నుంచి స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ. వై.రామాంజనేయులు లద్దగిరి పీహెచ్‌సీ నుంచి తుగ్గలి పీహచ్‌సీ, ఎం.మురారయ్య హాలహర్వి (ఎన్) పీహెచ్‌సీ నుంచి పెద్దతుంభలం పీహెచ్‌సీకి, మాడిఫికేషన్ ఆర్డర్స్‌ను డీఎంహెచ్‌వో ఇచ్చారు. రెండు నెలల క్రితంలో ఉమ్మడి జిల్లాలో ఎంపీహెచ్‌ఏ (ఎం)లకు డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణలో భాగంగా రీడిప్లాయిమెంటు చేశారు. కమిషనర్, కలెక్టర్ అనుమతి లేకుండా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఐదు మంది ఉద్యోగులకు ఉన్న ఫలంగా ఎలా రీడిప్లాయి మెంటు చేస్తారని కొన్ని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. దీని వెనుక కొంత సొమ్ము చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 40 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్)ను ఒకేసారి ఏ జిల్లా పరిధిలో ఉన్న వారిని అక్కడే రిడిప్లామెంట్ చేసిన అధికారులు ఇప్పుడు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ఎలా రిడిప్లాయిమెంట్ చేశారో అధికారులకే తెలియాలి. దీనిపై కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళను రాత్రి ఫోన్‌లో వివరణ కోరగా ఆమె అందుబాటులో రాలేదు.

అమ్మా.. ఇక సెలవ్..!

- హరితా క్షమించు... నా టైం ఇక్కడితో అయిపోయింది..
- రూ.35 వేలకు రూ.1.20 లక్షలు కట్టా.. ఇక కట్టలేను..
- సెంట్రల్ బ్యాంకు ఉద్యోగి ఆవేదన
- అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్య
- బ్యాంకులోనే ఉరి
- అప్పుల వేధింపులు అంటూ సూసైడ్ నోట్

'అమ్మా.. ఇక సెలవ్. హరితా నన్ను క్షమించు. నేను బతికి మీకు ఎలాంటి లాభం లేదు. పిల్లల్ని, నిన్ను వదిలి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. నేను చేసుకున్న అప్పులే నా పాలిట శాపం అయ్యాయి. నా టైం ఇక్కడితో అయిపోయింది. రూ.50 వేలు అప్పు తీసుకుంటే... రూ.15 వేలు పట్టుకుని రూ.35 వేలు ఇచ్చారు. ప్రతినెలా రూ.15,000 ఇచ్చాను. వడ్డీ కడుతూ ఇప్పటి వరకూ రూ. 1.20 లక్షలు కట్టాను. ఇంక నా వల్ల కాదు.'

ఇవీ అప్పుల బాధలు, వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ప్రాణం తీసుకున్న బ్యాంకు ఉద్యోగి రాసుకున్న ఆఖరి మాటలు. రూ.35 వేలు తీసుకుంటే... ఇప్పటి వరకూ రూ.1.20 లక్షలు కట్టాడంటే.. వడ్డీ వ్యాపారులు ఏ స్థాయిలో వసూళ్లు చేశారో చెప్పనక్కర్లేదు.



రవికుమార్ (ఫైల్)

అనంతపురం క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గుత్తి రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి రవికుమార్ (40) అప్పుల బాధలు భరించలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బ్యాంకులోనే ఉరేసుకుని, ప్రాణం తీసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలులోని సీ క్యాంపు ప్రాంతానికి చెందిన సంకుల రవికుమార్ కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి స్థానిక వినాయకనగర్‌లో స్థిరపడ్డాడు. భార్య హరిత, పిల్లలు సూర్యతేజ(13), దీక్షిత(11), వీక్షిత (10) ఉన్నారు. 12 ఏళ్లుగా బ్యాంకులో సబ్ స్టాఫ్(దఫ్తరీ)గా పనిచేస్తుండే వాడు. బుధవారం ఉదయం 9.45 గంటలపుడు బ్యాంకుకు వెళ్లాడు. కాసేపు అక్కడి ఉద్యోగులతో మాట్లాడాడు. అంతకుముందు భార్యకు ఫోన్ చేసి మనసు బాగోలేదని చెప్పాడు. తర్వాత 9.50గంటలకు బ్యాంకులోని వాష్ రూమ్‌కు వెళ్లి కిటికీకి కొత్తగా తెచ్చుకున్న నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నాడు. వాష్‌రూమ్ తలుపులు తీయకపోవడంతో గుర్తించిన బ్యాంకు సిబ్బంది, ఇంటికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో కార్పెంటర్ ఓపెన్ చేసి చూడ గా... ఉరివేసుకుని, మరణించాడు. సమాచారం అందుకున్న త్రీటౌన్ సీఐ శాంతిలాల్, వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వేధింపులే..

రవికుమార్‌ను అప్పులు, అధిక వడ్డీ వేధింపులే బలి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. 35 వేలకు ఇప్పటికే రూ.1.20 లక్షలు కట్టాననీ, ఇక కట్టలేనంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొనడం చూస్తేంటే.. వడ్డీలు కట్టడానికి జీతం చాలట్లేదని స్పష్టమవుతోంది. మరికొందరి వద్ద తీసుకున్న అప్పులు కూడా అతడికి భారంగా మారినట్లు స్పష్టమవుతోంది. రవికుమార్ మూడు రోజులపాటు సెలవు తీసుకున్నాడని బ్యాంకు సిబ్బంది ద్వారా తెలుస్తోంది. సెలవు ముగించుకుని వచ్చీ రాగానే... బ్యాంకు ఉద్యోగులు, కుటుంబీకులను ఒకసారి మాట్లడించి, అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. రవికుమార్ మృతదేహాన్ని వాష్‌రూమ్ నుంచీ బయటకు తీయగానే... భార్య హరిత, ఇతర కుటుంబీలు కన్నీరుమున్నీరయ్యారు. తోటి బ్యాంకు ఉద్యోగులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. కొందరు ఉద్యోగులకు నోట మాట రాలేదు. హరిత ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిక వడ్డీలకు అడ్డుకట్ట వేయాలి

అధిక వడ్డీ వేధింపుల కారణంగానే బ్యాంకు ఉద్యోగి రవికుమార్ ఆత్మహత్య చేసుకున్నారని అధిక వడ్డీల వ్యతిరేక పోరాట స మితి జిల్లా అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. రవి మృతదేహాన్ని హరితో పాటు మరికొందరు మార్చురీ వద్ద సందర్శించి, అతడి కుటుంబీకులను ఓదార్చారు. తర్వాత ఆయన మాట్లాడుతూ... నగరంలో వడ్డీ వ్యాపారుల అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. వాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే... ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కాల్ మనీ కేటుగాళ్లను ప్రభుత్వం, పోలీసులు కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

రీవ్రరీఫికేషన్

- సదరం శిబిరానికి బారులుదీరిన దివ్యాంగులు
- 50మందికి గానూ 800 మంది హాజరు
- అధికారుల సమన్వయ లోపం
- సరైన సౌకర్యాలు కల్పించని వైనం
- మళ్లీ రమ్మన్నారంటూ ఆవేదన

దివ్యాంగులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. ఈనెల పింఛన్లు రాక చాలా మంది అవస్థలు పడ్డారు. ఈనెల దివ్యాంగుల పింఛన్‌ను అధికారులు హోల్డ్‌లో పెట్టారు. జిల్లావ్యాప్తంగా పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు సదరం శిబిరాల్లో రీవెరిఫికేషన్ చేయించుకోవాలి. దీని కోసం కర్నూలు జీజీహెచ్‌లో సదరం శిబిరానికి బారులు దీరారు. మంత్రాలయం, పత్తికొండ, హోళగుంద, ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, కౌతాళం, కోసిగి, నందవరం వంటి సుదూర ప్రాంతాల నుంచి నడవలేని వారు ఇతర దివ్యాంగులు ఆటోలు, జీపు, బస్సుల్లో తరలివచ్చారు. వాస్తవానికి కర్నూలు జీజీహెచ్‌లో బుధవారం కేవలం 50మందికి మాత్రమే రీవెరిఫికేషన్ ఉంది. 50 మందికి గానూ 800 మంది దివ్యాంగులు సదరం శిబిరానికి వచ్చారు. ఆస్పత్రిలో కనీసం వారికి తాగడానికి నీరు కూడా లేక ఇబ్బందులు పడ్డారు.



సదరం శిబిరానికి భారీగా వచ్చిన దివ్యాంగులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సదరం శిబిరాల నిర్వహణ గందరగోళంగా మారింది. ఈనెల దివ్యాంగుల పింఛన్‌ను అధికారులు హోల్డ్‌లో పెట్టడంతో పింఛన్‌ను నిలుపుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు సదరం శిబిరాల్లో రీవెరిఫికేషన్ చేయించుకోవాలి. ఇందు కోసం ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా సదరం శిబిరాలను ఏర్పాటుచేసింది. జిల్లాలో ఆర్థో, వినికిడి, కంటి, మానసిక సమస్యలతో దాదాపు 40 వేలకు పైగా సదరం సర్టిఫికెట్ల ద్వారా ఒక్కొక్కరు రూ.6వేల పింఛన్లు పొందుతున్నారు. ఆగస్టు నెలలో మూడు వేల మంది దివ్యాంగుల పింఛన్‌ను హోల్డ్‌లో పెట్టారు.

సుదూర ప్రాంతాల నుంచి..

రీవెరిఫికేషన్‌కు సదరం శిబిరాలకు వెళ్లని దివ్యాంగుల పింఛన్‌ను నిలుపుదల చేయడంతో బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సదరం శిబిరానికి బారులు దీరారు. మంత్రాలయం, పత్తికొండ, హోళగుంద, ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, కౌతాళం, కోసిగి, నందవరం వంటి సుదూర ప్రాంతాల నుంచి నడవలేనివారు ఇతర దివ్యాంగులు ఆటోలు, జీపు, బస్సుల్లో తరలివచ్చారు. వాస్తవానికి కర్నూలు జీజీహెచ్‌లో బుధవారం కేవలం 50 మందికి మాత్రమే రీవెరిఫికేషన్ ఉంది. 50మందికి గానూ 800 మంది దివ్యాంగులు సదరం శిబిరానికి రావడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కర్నూలు జీజీహెచ్ సూపరింటెం డెంట్ డా.కే.వెంకటేశ్వర్లు శిబిరానికి చేరుకుని మరలా తేదీని రీవెరిఫికేషన్ కోసం ఇవ్వాలని ఆదేశించారు.

తాగునీరు కూడా లేక..

దివ్యాంగులు సదరం, సచివాలయ సిబ్బంది ఇచ్చిన నోటీసులను చేతబట్టి బారులు తీరారు. మధ్యాహ్నం 3గంటల వరకు దివ్యాంగులు నడవలేని వారు అవస్థలు పడ్డారు. ఎక్కువ సంఖ్యలో దివ్యాంగులు రావడంతో తాగడానికి కూడా మంచినీరు లేక ఇబ్బందులు పడ్డారు. రీవెరిఫికేషన్‌లో వైద్యులతో తాము ఎక్కువ పర్సంటేజీ వేయిస్తా మంటూ కొందరు దళారీలు దివ్యాంగులను నమ్మబలుకుతున్నారనికొందరు పిర్యాదు చేశారు. సదరం సిబ్బంది మాత్రం ఏ మాత్రం పట్టించుకోకపోవడం విశేషం. చివరకు దివ్యాంగులకు రీవెరిఫికేషన్ తేదీలను రాసి ఇవ్వడంతో మధ్యాహ్నం 3గంటలకు వెనుదిరిగారు.



దివ్యాంగులకు తేదీలను రాసి ఇస్తున్న సదరం క్లర్క్

రూ.2వేలు ఖర్చుపెట్టి ఆటోలో వచ్చా



మాది ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామం. ఈనెల దివ్యాంగుల పింఛన్ ఇవ్వలేదు. సచివాలయ సిబ్బంది కర్నూలు వెళ్లి సదరం శిబిరంలో వైద్యులతో పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు తెచ్చుకోవాలన్నారు. దీంతో నడవలేని తాను రూ.2వేలు ఖర్చు పెట్టి ఆటోలో వచ్చాను. తీరా ఇక్క డికి వస్తే మళ్లీ రమ్మన్నారు. **- చంద్రన్న, పింఛన్‌దారుడు, ముత్తుకూరు, ఆస్పరి మండలం.**

తీరా ఇక్కడికి వస్తే వెనక్కు.



పింఛన్ రాలేదని ఆదోని నుంచి ఆటోలో కర్నూలుకు వచ్చా. నడవలేను కాబట్టి ఆటోలో వచ్చాను. నాకు రూ.6వేల పింఛన్ వచ్చేది. అది ఈనెల రాలేదు. దీంతో కర్నూలు సదరం శిబిరానికి వెళ్లాలన్నారు. తీరా ఇక్కడకు వస్తే వెనక్కు పంపారు. **- మల్లికార్జున, పింఛన్‌దారుడు, ఆదోని**

36 మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో 36 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎ.గంగాధర్	వీఆర్, కర్నూలు	ఆస్పరి, యూపీఎస్
డి.మస్తాన్‌వలి	ఆస్పరి యూపీఎస్	వీఆర్, కర్నూలు
డి.హేమంత్ కుమార్ రెడ్డి	వీఆర్, కర్నూలు	అడిషినల్ ఎల్‌వోపీ, కర్నూలు వన్‌టౌన్, యూపీఎస్
ఎం.నాగశేఖర్	అడిషినల్ ఎల్‌వోపీ, కర్నూలు వన్‌టౌన్, యూపీఎస్	సీసీఎస్-1, కర్నూలు
ఎం.రామయ్య నాయుడు	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్	డీటీసీ, కర్నూలు
ఎం.పార్థసారధి	డీటీసీ, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
కె.శ్రీనివాస నాయక్	సీసీఎస్-1, కర్నూలు	ఆదోని ట్రాఫిక్ యూపీఎస్
జి.సుబ్బారావు	ఆదోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్	కడప వీఆర్
జె.రమేష్ కుమార్	నంద్యాల, వీఆర్	సీసీఎస్-2, కర్నూలు
ఎస్.అస్రార్ బాషా	సీసీఎస్-2, కర్నూలు	నంద్యాల టూటౌన్ యూపీఎస్
ఎస్‌కే ఇస్మాయిల్	నంద్యాల టూటౌన్ యూపీఎస్	సీసీఎస్-2, నంద్యాల
పూల రామకృష్ణ	సీసీఎస్-2, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
ఎన్. కృష్ణయ్య	డీసీఆర్‌బీ నంద్యాల	వీఆర్ కడప
పి.నరేష్‌బాబు	ఎర్రగుంట్ల యూపీఎస్	జమ్మలమడుగు యూపీఎస్
ఎస్.లింగప్ప	జమ్మలమడుగు, యూపీఎస్	బద్వేల్ యూపీఎస్
కె.రాజగోపాల్	బద్వేల్ యూపీఎస్	ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
సి.భాస్కర్ రెడ్డి	వీఆర్, కడప	జమ్మలమడుగు రూరల్ సర్కిల్
ఎస్.విశ్వనాథ్ రెడ్డి	రాయచోటి ట్రాఫిక్ స్టేషన్	ఎర్రగుంట్ల యూపీఎస్
ఎ.సురేష్ రెడ్డి	వీఆర్, కడప	సోషల్ మీడియా, సైబర్ సెల్, కడప
పి.రాజ	రాజంపేట, యూపీఎస్	కొండాపురం సర్కిల్
పి.మహ్మద్ రఫీ	కొండాపురం సర్కిల్	మదనపల్లి వన్‌టౌన్ యూపీఎస్
డి.నాగార్జున	వీఆర్, కడప	రాజంపేట యూపీఎస్
ఎస్.కుల్లాయప్ప	మన్నూరు యూపీఎస్	రాయచోటి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
జె.ప్రసాద్‌బాబు	వోయాలపాడు సర్కిల్	మన్నూరు యూపీఎస్
ఎస్.అనిల్ కుమార్	కలకాడ సర్కిల్	కలికిరి యూపీఎస్
బి.రాఘవరెడ్డి	ఆర్ఎస్‌టీఎఫ్, అన్నమయ్య	వోయాలపాడు సర్కిల్
బి.లక్ష్మన్న	మొలకల చెరువు సర్కిల్	కలకాడ సర్కిల్
సి.వెంకటేశ్వర్లు	వీఆర్, తిరుపతి	మొలకలచెరువు సర్కిల్
పి.చంద్రశేఖర్	వీఆర్, అన్నమయ్య	ఆర్ఎస్‌టీఎఫ్, అన్నమయ్య
జి.జీవన్ గంగనాథ్‌బాబు	బి.కొత్తకోట యూపీఎస్	వీఆర్, నంద్యాల
కె.గోపాల్ రెడ్డి	వీఆర్, కడప	బి.కొత్తకోట యూపీఎస్
కే.రాజారెడ్డి	ఎస్‌బీ-3 అన్నమయ్య	మదనపల్లి టూటౌన్ యూపీఎస్
కె.రామచంద్ర	మదనపల్లి టూటౌన్ యూపీఎస్	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య
ఎం.తిమ్మారెడ్డి	వీఆర్, అన్నమయ్య	ఎస్‌బీ-3 అన్నమయ్య
ఎ.మోహన్ కుమార్	డబ్ల్యూపీఎస్-2 అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
ఎస్.గురునాథ్	వీఆర్, కడప	డబ్ల్యూపీఎస్-2 అన్నమయ్య

స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అరుదైన శస్త్రచికిత్సలు



రోగులతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు, సిబ్బంది

- తొలిసారిగా ప్రాంక్రియాస్ సర్జరీ విజయవంతం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో సర్జికల్ అంకాలజి వైద్య నిపుణులు రెండు అరుదైన ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. మొట్టమొదటిసారిగా ప్రాంక్రియాస్ క్యాన్సర్ సర్జరీని చేశారు. ఓర్వకల్లు మండలానికి చెందిన 57ఏళ్ల వ్యక్తికి సర్జికల్ అంకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చైతన్యవాణి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.భీసన్న మత్తుమందు వైద్యులు డా.భారతి, డా.సంధ్య, డా.జ్యోత్స్నలు జూలై 18న సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయాన్ని స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్ ద్వారా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు తెలిపారు. కడప జిల్లా కాసియాన మండలానికి చెందిన 74 ఏళ్ల వృద్ధుడు మలద్వార క్యాన్సర్‌తో బాధపడుతూ జూలై 21న అడ్మిషన్ పొందారు. ఆపరేషన్‌ను జూలై 24న సర్జికల్ అంకాల జిస్టులు డా.చైతన్యవాణి, డా.బీసన్న, అనస్థీషియా వైద్యులు డా.భారతి, కాంచన, మాలిక్ ల్యాప్రోస్కోపిక్ ద్వారా అబ్డామినో పెరినియల్ రిసెక్షన్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈరెండు కేసులు ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉచితంగా నిర్వహించామని స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణప్రకాష్ తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ డా.పీఎస్ రాజా రవికుమార్, సర్జికల్ అంకాలజి అసోసియేట్ ప్రొఫెసర్ డా.నరేష్, అసిస్టెట్ ప్రొఫెసర్ డా.సంపత్‌రెడ్డి, పెథాలజి ప్రొఫెసర్ డా.వరలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ అనసూయ పాల్గొన్నారు.

'హజ్ యాత్రికులకు రూ.లక్ష చొప్పున సాయం'

కర్నూలు అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): హజ్ 2025కు విజయవాడ కేంద్రం ద్వారా వేళ్లే యాత్రికులకు ప్రతి ఒక్కరికి రూ.లక్ష సహాయం ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ ఆలీఖాన్ తెలిపారు. బుధవారం నగరంలోని మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన నేపథంలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ఎన్నుకున్న 72మంది యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చి హామీ మేరకు రూ. 72 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంగళ వారం మంజూరు చేసిందని తెలిపారు. సహకరించిన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే వారు ఈనెల 7 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వాహనం బోల్తా.. 15 మందికి గాయాలు

వెల్దుర్తి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారి-44పై ట్రాలీ వాహనం టైరు పేలడంతో బోల్తాపడి 15మంది గాయ పడ్డారు. వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం రుద్రవరం గ్రామస్థులు నంద్యాల జిల్లా డోన్ సమీపంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కుమారుడి రిసెప్షన్‌కు వెళ్లారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వెళుతున్న క్రమంలో వెల్దుర్తి సమీపాన టైరుపేలింది. వాహనంలో ప్రయాణిస్తున్న 15 మందికి వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందజేశారు. తీవ్రంగా గాయపడిన 5 మందిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు సర్వజనవైద్యశాలకు తరలించారు. అదే సమయంలో కర్నూలుకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి తన వాహనాన్ని ఆపి, అంబులెన్స్‌కు ఫోన్‌చేసి క్షతగాత్రులకు సాయం చేశారు.

బుగ్గన కుమారుడి రిసెప్షన్‌కు వైఎస్ జగన్

- వాహనాలను నిలిపివేసిన పోలీసులు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు, ప్రయాణికులు



నూతన వధూవరులతో మాజీ సీఎం వైఎస్ జగన్

డోన్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని దత్తాత్రేయస్వామి ఆలయ వెనుక ప్రాంతంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడి బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా హెలిప్యాడ్ నుంచి రిసెప్షన్ వేదికకు ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. అభిమానులు ఆయనకు కరచాలనం చేసే ప్రయత్నంలో తోపులాట జరిగింది. వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా డోన్‌కు షెడ్యూల్ ప్రకారం రూ.11.45 గంటలకు చేరుకున్నారు. వివాహ రిసెప్షన్ వేదికలో నూతన వధూవరులను ఆశీర్వదించి 12.30 గంటలలోపు తిరిగి హెలికాప్టర్‌లో బెంగళూరుకు తిరుగు పయనమయ్యారు.

ఇబ్బందులు పడ్డ వాహనదారులు: డోన్ పట్టణ సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న దత్తాత్రేయ స్వామి గుడి సమీప ప్రాంతంలో సుమారు 20 నిమిషాల పాటు వాహనాలను నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో డోన్ పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, సీఎం రాకేష్‌బాబు, పోలీసు సిబ్బందితో పాటు వివిధ ప్రాంతాల నుంచి పోలీసు అధికారులు మొత్తం 150 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అభిమానుల అత్యుత్సాహం

డోన్‌కు మాజీ సీఎం జగన్ రాక సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ యువ అభిమానులు తగ్గేదెలే.. అంటూ వైఎస్ జగన్ ఫొటోతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ బైకుల మీద హెలిప్యాడ్ ప్రధాన రోడ్డు ప్రాంతంలో కొద్దిసేపు హల్‌చల్ చేశారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ పంపిణీ అంటూ ప్రవేశ పెట్టిన రేషన్ వాహనాన్ని పార్టీ అభిమాని వైఎస్ జగన్ బొమ్మ ఉన్న అప్పటి రేషన్ వాహనంతో రోడ్డుపై చక్కర్లు కొట్టారు.

రింగ్ రోడ్డు పనులు ప్రారంభం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరుగుతున్న రింగ్ రోడ్డు పనులు

ఆత్మకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణం మీదుగా సుమారు రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న రింగ్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం మొదలుపెట్టారు. సాయిబాబా ఆర్జీ ఎదుట ఉన్న కళాంజలి గ్రాఫిక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్, నేతాజీనగర్, తిక్కయ్యస్వామిదర్గా, తోటగేరి, గాంధీపార్క్, పెద్దబజారు, గొల్లపేట, కొత్తపేట మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు రింగ్ రోడ్డుతో పాటు ఇరువైపుల డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న 4 మీటర్ల రోడ్డును 7 మీటర్ల వరకు విస్తరించి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ నిర్మాణ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉం టుం ది. అయితే ప్రస్తుతం తొలివిడతగా రూ.1.2కోట్ల నిధులతో తిక్కయ్యస్వామి దర్గా వరకు ఈ పనులను చేపడుతున్నారు. ఆతర్వాత మరి న్ని నిధులతో పనులను పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించండి

ఆత్మకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి ఆయా రాజకీయ పార్టీలు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పారదర్శకమైన ఓటరు జాబితాకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు సహకరించాలని కోరారు. గతంలో ఓటరు జాబితాలో పేర్లు, అడ్రస్ మార్పు, కొత్త ఓటర్ల కోసం వచ్చిన దరఖాస్తులను పునర్ పరిశీలన చేయాలని సూచించారు. ఇంకా ఎవరైనా కొత్తగా ఓటరు నమోదు, ఇతర సవరణల కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లయితే వాటిని పరిశీలించి నమోదు చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరులో భారీ వర్షం


ఆత్మకూరు పట్టణ శివార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పడేవాగు

ఆత్మకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే రాత్రి 9గంటల నుంచి 3.12సెంమీల వర్షాపాతం నమోదైంది. దీంతో పట్టణంలోని పలు లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు కొంత అసౌకర్యానికి లోనయ్యారు. గత కొన్నిరోజులుగా సరైన వర్షం లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే ఎట్టకేలకు పదునైన వర్షం కురియడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది.

దోబీ ఘాట్ల పరిశీలన


రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్‌పర్సన్ సావిత్రమ్మను సత్కరిస్తున్న రజకులు

ఆత్మకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని పడేవాగు సమీపంలో ఉన్న దోబీఘాట్లను బుధవారం రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్‌పర్సన్ సావిత్రమ్మ పరిశీలించారు. స్థానిక రజకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం దోబీ ఘాట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్న ఇక్కడి రజకులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. రజక సంఘం పెద్దలు ఆమెను శాలువాతో సత్కరించారు. సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షులు రామకృష్ణ, నాయకులు శ్రీనివాసులు, శివకేశవ, రంగన్న, నాగశేషులు, వెంకటస్వామి, శివుడు, జయన్న, నాగరాజు ఉన్నారు.

మహానందిలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పూజలు


మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారు రాజుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

మహానంది, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహానందిలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారురాజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ముఖమంటపం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకం, కుంకుమార్చన పూజలు జరిపారు. కల్యాణ మంటపంలో వేద పండితులు వీరిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, కేసీ హరి, తాతిరెడ్డి తులసిరెడ్డి, శశిభూషణంరెడ్డి, నరసింహరావు, టీడీపీ నాయకులు సుదర్శనం రెడ్డి, పాశంరాజా పాల్గొన్నారు.

రేపు వరలక్ష్మి వ్రతం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తెలుగుపేటలో వెలసిన ఘణమద్దులేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం లక్ష్మీకుబేర హోమం, వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మధుసూదన్ రాయల్ తెలిపారు. మూడో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఉదయం 8గంటలకు భక్తులు ఆలయంలో నిర్వహించే లక్ష్మీకుబేర హోమాన్ని వీక్షించి, వరలక్ష్మి వ్రతంలో పాల్గొనాలని సూచించారు.

కరెంట్ కష్టాలు


జనరేటర్

● కరెంట్ పోతే ఫిజియోథెరపీ భవనం అంధకారమే

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పెద్దాసుపత్రిలో కరెంట్ కష్టాలు తీరడం లేదు. విద్యుత్ లేకపోతే జీజీహెచ్‌లోని ఫిజియోథెరపీ భవనం చీకటిలో మగ్గాల్సిందే. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తెగిన తీగలను అతికించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. దాదాపు ఏడాది నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. విద్యుత్‌శాఖ ప్రతి రెండో శనివారం మెయింటెనెన్స్ కోసం విద్యుత్ కోత విధిస్తోంది. ఫిజియోథెరపీ భవనంలో స్టాక్ ఉంచుతున్నారు. ఈ భవనం పక్కనే జనరేటర్ ఉన్నా దానిని వినియోగించుకోవడం లేదు. దీంతో విద్యుత్ లేకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకునేందుకు వస్తున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం పక్కన ఇటీవల ఆధునికీకరణ పనులు చేయడంతో జనరేటర్ నుంచి వచ్చే విద్యుత్ వైర్లు తెగిపోయాయి. వాటిని అతికించేందుకు పట్టించుకోవడం లేదు. విద్యుత్‌లేకపోవడంతో సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి దృష్టికి వివరణ కోరగా విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.


విద్యుత్ కోసం వేచి చూస్తున్న రోగులు (ఫైల్)


విద్యుత్‌లేక చీకటిగా ఉన్న ఫిజియోథెరపీ గది

చెంచు రైతులు, అటవీ అధికారుల మధ్య వాగ్వాదం


చదరంపెంటలో అటవీ అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం

కొత్తపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చదరంపెంట గూడెం రైతులకు స్థానిక అటవీ శాఖ అధికారుల మధ్య వాగ్వాదంతో పాటు తోపులాట జరిగింది. పాలెంచెరువు సమీపంలోని అటవీప్రాంతంలోని చదరంపెంటలో అటవీహక్కుల చట్టం కింద గతంలో సుమారు 45 ఎకరాల సాగుభూమిని 29 మంది చెంచు రైతులకు అప్పట్లో ఐటీడీఏ అధికారులు కేటాయించారు. అయితే ప్రస్తుతం చెంచులు సాగు చేసుకుంటున్న వరి, మామిడి మొక్కలను అటవీ జంతువుల భారీ నుంచి కాపాడుకునేందుకు చెంచుల అభ్యర్థనల మేరకు ఐటీడీఏ అధికారులు పొలాల చుట్టూ ఇనుప కంచె వేసుకునేందుకు మంజూరు చేశారు. అయితే మంగళవారం చెంచులు పొలాలకు కంచె ఏర్పాటు చేసుకుంటున్నారన్న సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు మూకుమ్మడిగా వెళ్లి ఇనుపకంచెను తొలగించాలంటూ చెంచు రైతులపై వాగ్వావాదానికి దిగి తోపులాడుకున్నారు. ఎట్టకేలకు చెంచులు కంచెను తీసేదిలేదని భీష్మించడంతో అటవీ శాఖ అధికారులు వెనక్కు వెళ్లారు. ఈ విషయంపై ఆత్మకూరు ఫారెస్టు రేంజ్ అధికారి, కొత్తపల్లి ఇన్‌చార్జి కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా.. చెంచు రైతులు ఇనుసకంచె ఏర్పాటు చేసుకోవడం వల్ల రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు అడవీ జంతువులకు ప్రమాదం పొంచి ఉందనే కారణంతో చెంచులకు ఇనుప కంచె వేసుకోరాదని చెప్పడం జరిగిందని తెలిపారు.

9న సత్యసాయిబాబా జయంతి

నంద్యాల కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ పార్కులోపల వెలసిన ఆయుష్ యోగా కేంద్రంలో 9వతేదీ శనివారం ఉదయం భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు, రాఖీపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆనంద్ గురూజీ తెలిపారు. ఈ కార్యక్రమానికి నంద్యాల ప్రజలు, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మహానంది, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని మండల ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు తోట కవిత అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం మహానంది మండలం అబ్బీపురం గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్ చంద్రలీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పర్యవేక్షకురాలు కవిత, అంగన్‌వాడీ టీచర్ హుసేనమ్మ, ఏఎన్ఎం సరోహన్నా, మహిళా పోలీస్ హరితలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

పాణ్యం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ దినేశ్‌బాబు తెలిపారు. బుధవారం పాఠశాలలో 12 మంది విద్యార్థులకు కొండజూటూరు సర్పంచ్ సుజిత్‌రెడ్డి క్రీడా దస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఈనెల 8, 9 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీ కిరణ్‌కుమార్ రెడ్డి, కోచ్ గణేష్, పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

● ఏవో అమీరున్నీసా బేగం


కొత్తపల్లి మనగ్రోమర్ సెంటరులో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో అమీరున్నీసా బేగం

కొత్తపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనుమతులు లేని ఎరువులు, పాత ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి అమీరున్నీసా భేగం ఎరువుల దుకాణాల డీలర్లను హెచ్చరించారు. బుధవారం ఏవో కొత్తపల్లిలోని మనగ్రోమర్ సెంటర్, నాగంపల్లి సహకార సొసైటీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ముందుగా ఆమె మన గ్రోమోర్ సెంటరులో మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని, ప్రతి దుకాణంలో స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని దుకాణాదారులకు సూచించారు. అనంతరం ఆమె నాగంపల్లి సొసైటీని పరిశీలించి రైతులకు ఎన్ని క్వింటాళ్ల ఎరువులు సరఫరా చేశారని ఆరాతీశారు. యూరియా అధిక మోతాదులో పంటలు వేయరాదని అక్కడున్న రైతులకు సూచించారు. నానో యూరియా, నానో డీఏపీలనుకూడా రైతులు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఏఈవో శ్రీనివాసులు, రైతు సేవా సిబ్బంది ఉన్నారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు


నందీశ్వరునికి పూజలు చేస్తున్న వేదపండితులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో లోకకల్యాణార్థం సాక్షిగణపతికి బుధవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం పంచామృతాలతోను, పలుపుష్పోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోధకం, పుష్పోదకం, కలశోదకం, శుద్దజలంతో అభిషేకం నిర్వహించారు.

● శ్రీశైలక్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరస్వామికి బుధవారం విశేషఅర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలోభాగంగా అర్చకులు నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోను, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోతకం, భోస్మదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం,సువర్ణోదకం, శుద్ధజలంచే అభిషేకాలు నిర్వహించారు.

● మల్లికార్జునస్వామి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి పక్కనే ఉన్న వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ఉదయం పంచామృతాలతోను, పలుపుష్పోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోధకం, పుష్పోదకం, కలశోదకం, శుద్దజలంతో అభిషేకం నిర్వహించారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


వెలుగోడులో ప్రతిష్ఠించిన అమ్మవారు


ఆత్మకూరులో పూజలందుకుంటున్న అమ్మవారు

వెలుగోడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వాసవీ కన్యాక పరమేశ్వరిదేవి ఆలయ, విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, కూడ చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షులు భవనాశి మహేశ్, నంద్యాల మున్సిపల్ కార్పొరేటర్ ఖండేలాల్ శ్యాంసుందర్, మాజీ అధ్యక్షులు పత్యానారయణ, నెరవాటి రవితో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరీదేవి..

ఆత్మకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని తోటగేరిలో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో గతంలో ఏర్పాటు చేసిన పురాతన ధ్వజస్తంభం దెబ్బతినడంతో ఆస్థానంలో విజయవాడకు చెందిన తంగెళ్ల తిమ్మయ్య, తులసమ్మ దంపతుల సహకారంతో నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న టీజీ వెంకటేశ్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు

బాస్కెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక


జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన శాంతిరాం జట్టు

పాణ్యం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా 29న జిల్లా క్రీడల అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న పోటీలకు జిల్లా బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక పూర్తయినట్లు డీఎస్‌డీవో రాజు తెలిపారు. బుధవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల్లో ఐదు మహిళా జట్లు, ఏడు పురుషుల జట్లు పాల్గొన్నాయన్నారు. వీరిలో విన్నర్స్‌గా శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల మహిళా జట్టు, రన్నర్స్‌గా ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల పురుషుల జట్టు ఎంపికైందన్నారు. ఎంపికైన జట్లు తిరుపతిలో 11 నుంచి 14 వరకు జరిగే జోనల్ పోటీలలో పాల్గొంటాయన్నారు. జోనల్ పోటీల్లో ఎంపికైన జట్లు ఈనెల 16 నుంచి 20 వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీఎం కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, పిడిలు వెంకటేశ్, చంద్రారెడ్డి, నాయక్, మునిశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు విద్యార్థినుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలకు పొన్నాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఐజయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 2న నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లో ఉన్న డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎస్.వెంగళ (36కేజీలు), కె.కస్తూరి (52కేజీలు), ఎల్.దివ్య (57 కేజీల) విభాగంలో బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 9, 10తేదీల్లో మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థినులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు విశ్వనాథ్, హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, సరోజ, రసూల్‌బీ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

షూటింగ్‌బాల్ పోటీలకు శాంతినికేతన్ విద్యార్థులు


విద్యార్థినులను అభినందిస్తున్న చైర్మన్ సుధాకర్

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాంతి నగర్‌లో ఉన్న శాంతినికేతన్ సీబీఎస్ఈ విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు చైర్మన్ సుధాకర్ బుధవారం తెలిపారు. జూలై 26వ తేదీన కోవెలకుంట్లలో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడంలో తమ పాఠశాల ముందుంటుందన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విద్యార్థులు రాణించాలన్నారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జానీ, సతీష్, మధు, శ్రీలేఖలను ప్రత్యేకంగా అభినందించారు.

చదరంగం పోటీల్లో ఎల్‌కేఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కోటి నాగేశ్వరరావు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని ఎల్‌కేఆర్ గ్లోబల్‌స్కూల్ విద్యార్థులు ఈ నెల 5న రామకృష్ణ కాలేజిలో నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కోటి నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అబినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

పాములపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూచించిన సర్వేలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని చెలిమిల్ల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పి4 సర్వే పూర్తిచేసి ఎంపికైన బంగారు కుటుంబాలను మ్యాపింగు చేయాలన తెలిపారు. అలాగే ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

వేతనాలు పెంచాలి.. యాపుల భారాన్ని తగ్గించాలి

పాములపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచి, యాప్‌ల భారాన్ని తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, సీఐటీయూ మండల కార్యదర్శిరాజు, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ జిల్లా నాయకురాలు శివలక్ష్మి అన్నారు. పాములపాడులో బుధవారం వారుమాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం రద్దు చేస్తూ పన్నెండు గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు సిద్దమవుతున్నారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వివిధ రకాల స్కీములలో విధులు నిర్వహిస్తున్న వర్కర్లకు నెలకు రూ 26 వేలు వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించినా పట్టించుకోవడం లేదని అన్నారు.

మోసాల కూటమి ప్రభుత్వం

నందికొట్కూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని నందికొట్కూరు వైసీపీ సమన్వయకర్త డా.సుధీర్ అన్నారు. బుధవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, విద్యానగర్, మిడ్తూరు మండలంలోని దేవనూరు, చింతరపల్లె గ్రామాల్లో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ'ఇంటింటికి వంచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోలను ప్రజలకు వివరించారు. ఎవరిని అడిగినా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, ప్రతి పథకాలు కోతలు పెడుతున్నారని ప్రజలు చెబుతున్నారన్నారు.పట్టణాధ్యక్షులు మన్సూర్ అహ్మద్, జడ్పీటీసీ యుగందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తువ్వా మల్లారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, వార్డు ఇంచార్జీలు రమణారెడ్డి, సతీష్‌రెడ్డి, కౌన్సిలర్ నాయబ్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మార్కెట్ రాజు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నులిపురుగులను నివారిద్దాం

రుద్రవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రలతో విద్యార్థుల్లో నులిపురుగులు నివారిద్దామని వైద్యాధికారి అమర్‌నాథరెడ్డి, నాగశ్రీజారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రపరిధిలో ర్యాలీ నిర్వహించి, ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు, యుక్తవయసు బాలబాలికలు రక్తహీనతకు గురవుతున్నారని అన్నారు. తీవ్ర పోషకాహారలోపం కలిగించే నులి పురుగుల నివారణ కోసం ఈ నెల 12న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో , పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్‌మాత్రలు విద్యార్థులకు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటరు రత్నాలు, సూపర్‌వైజర్లు రసూల్, మల్లేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

చాగలమర్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపాధి ఏపీవో ఖాసీం సాహెబ్ తెలిపారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్‌ఏల సమావేశం నిర్వహించారు. మండలంలో 17 సచివాలయాల పరిధిలోగల గ్రామాలలో 220 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని అన్నారు. వందశాతం సబ్సీడీతో పండ్ల మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

పంటల బీమా గడువు పొడిగింపు

చాగలమర్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పంటల బీమా, పసల్‌బీమా యోజన కింద పంటలకు ప్రీమియం గడువు చెల్లింపును పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. 14వరకు ప్రీమియం చెల్లించేందుకు గడువు ఇచ్చారని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, రేవతి ఉన్నారు.

చేనేతలకు మంచి రోజులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంతో చేనేత వర్గాలకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి వంకం నాగచౌడయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేనేత వర్గాలను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. మంత్రివర్గ సమావేశంలో వరాలు కురిపించి నేతన్నపై చంద్రబాబుకు ఉన్న మనస్సును రుజువు చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి: సీడీపీవో


గర్భిణులకు శ్రీమంతం చేస్తున్న సీడీపీవో తేజస్విని

ఉయ్యాలవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఆళ్లగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో తేజస్విని అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉయ్యాలవాడలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు ప్రభాకరమ్మ, కార్యకర్తలు ప్రకృతి, రాజేశ్వరి, గురులక్ష్మి, ఆయాలు ఉన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

డోన్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారు. ముందుగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి 105వ జయంతిని పురస్కరించుకుని మండల స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు ప్రారంభిస్తారు. కృష్ణానగర్‌లోని భాష్యం పాఠశాల సమీపంలో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన వాటర్ పైపులైన్ పనుల శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు చనుగొండ్ల గ్రామంలో, 5 గంటలకు ఇందిరాంపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు కోరారు.

పారిశుధ్య నిర్మూలనకు చర్యలు

బనగానపల్లె, ఆగస్టు 6, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలుకూరు గ్రామంలో విషజ్వరాలు విజృంభించడంతో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఈవో సతీశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలో నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల నివారణకు చర్యలు తీసుకంటున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో వ్యాధులు రాకుండా వీధుల్లో పిచికారి చేయించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల వద్ద మురుగునీరు నిల్ల ఉండడంతో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణ స్ప్రే చేశారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఇద్దరికి డెంగీ జ్వరాలు

పలుకూరు గ్రామంలో ఇద్దరికి డెంగీ జ్వరాలు సోకినట్లు పలుకూరు డాక్టర్ మధుమౌనిక బుధవారం తెలిపారు. పలుకూరు ఆస్పత్రికి ఇరువురు జ్వరం ఉన్నట్లు ఆస్పత్రికి రావడంతో వారికి డెంగీ ఉన్నట్లు గుర్తించి వెంటనే బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. గ్రామంలోని కొత్తపేట వీధిలో సీజనల్ వ్యాధులు అధికంగా ఉన్నట్లు గుర్తించి గ్రామంలో స్పెషల్ క్యాంపులు నిర్వహించి జ్వరాల నివారణకు కృషి చేసినట్లు తెలిపారు. జ్వరం వచ్చిందని నిర్లక్ష్యం వహించవద్దన్నారు. వైద్యశాలకు తీసుకువస్తే పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు.

అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు

సంజామల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఫర్టిలైజర్స్ డీలర్లకు వ్యవసాయ అధికారి జ్యోతి హెచ్చరించారు. బుధవారం పేరుసోమలలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. దుకాణాల్లో యూరియా నిల్వ ఉంచుకొని దుకాణాదారులు ఇవ్వకపోతే తమకు ఫిర్యాదు చేయాలని ఆమె రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ఈ.ఒ వెంకటేశ్వర రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే కేసు

కోవెలకుంట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని వైజంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేశారు. లైసెన్సు, సర్టిఫికెట్, హెల్మెట్లు ధరించనివారికి జరిమానాలు విధించారు. బ్రీత్ ఎనలైజరుతో పరీక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయకూడదు

కొలిమిగుండ్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కొలిమిగుండ్ల గ్రామ ప్రజలు తాగు నీటిని వృథా చేయకూడదని సర్పంచ్ జినుగు శివరాముడు కోరారు. బుధవారం గ్రామంలోని పలు కాలనీల్లో పైప్ లీకేజీలకు మరమ్మతులు చేయించారు. తాగు నీటిని వృథా కాకుండా చూడటానికి పైపులైన్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.

రాకపోకలు బంద్

వర్షాలు కురిస్తే నేలవంతెనలతో ఇబ్బందులు

- ఎక్కడికి వెళ్లాలన్నా నరకయాతనే
- ప్రభుత్వాలు మారినా తప్పని తిప్పలు
- బ్రిడ్జిలకు మోక్షమెప్పుడో..?

వర్షాలు కురిస్తే నేలవంతెనలపై వాగులు, వంకలు పొంగి ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. ప్రజలు నేలవంతెనలపై ప్రయాణం కొనసాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులు పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లాలన్నా నరకయాతన పడాల్సిందే. ఈ నేలవంతెనలు రాకపోకలు ఏళ్ల తరబడి చేస్తున్నా బ్రిడ్జిల నిర్మాణానికి మోక్షం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పల్లె ప్రజల కల నెరవేరడంలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైపు ఆశతో చూస్తున్నారు. నేల వంతెనలు స్థానంలో బ్రిడ్జిలు నిర్మిస్తారన్న వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు.


హరినగరం సమీపంలో నేలవంతెన


ఆలమూరు సమీపంలో నేలవంతెన

రుద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిలకలూరు, పేరూరు, ఎర్రగుడిదిన్నె గ్రామాల సమీపంలో వకుళానదిపై నేలవంతెనలు ఉన్నాయి. పేరూరు గ్రామం వద్ద నిర్మించిన బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆలమూరు గ్రామ సమీపాన అట్టడివాగు సినిమాహాలు సమీపంలోనే మరో నేలవంతెన ప్రమాదకరంగా ఉంది.


చిలకలూరు గ్రామ సమీపంలో నేలవంతెనపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)

సినిమా హాలు సమీపంలో ఉన్న నేలవంతెనపై వర్షంనీరు దాటుతూ ఆలమూరు గ్రామానికి చెందిన యువకుడు గల్లంతయ్యాడు. హరినగరం, ముకుందాపురం గ్రామాల మధ్య తుండ్లవాగుపై మరో వంతెన ఉంది. ఆర్.నాగలవరం, రుద్రవరం గ్రామాల మధ్య నేలవంతెన ఉంది. నల్లవాగుపల్లె గ్రామాల సమీపంలో మరో నేలవంతెన ఉంది. పందిళ్లపల్లె, పెద్దకంబలూరు గ్రామాల మధ్య నేలవంతెన ఉంది. శ్రీరంగాపురం, కోటకొండ గ్రామాల మధ్య ఇప్పటికీ బ్రిడ్జి నిర్మించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఉన్నాయి. బీరవోలు, ఎకొత్తూరుగ్రామాల మధ్య వంతెన కూలిపోయింది. ఇంత వరకు ఆ వంతెన నిర్మించడానికి మోక్షం లభించ లేదు. వెలగలపల్లె సమీపంలో రెండు నేలవంతెనలు ఉన్నాయి. ఈ నేల వంతెనలు రుద్రవరం, నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్నాయి. వర్షాకాలం అధికారులు అప్రమత్తం చేసి వదిలేశారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఏళ్లతరబడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను పాలకులు పట్టించుకో వడం లేదని విమర్శలున్నాయి.

హామీలిచ్చి వదిలేస్తున్నారు..

ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప గ్రామీణ ప్రాంతాల్లో గ్రామాల మధ్య అనుసంధానమైన రహదారులు నేలవంతెన స్థానంలో బ్రిడ్జిలు నిర్మించడంలేదన్న విమర్శలున్నాయి. ఎన్నికల సమయంలో నాయకులు ప్రజలకు హామీలిచ్చి వదిలేస్తున్నారు. ప్రతి సారీ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. పరిష్కరించిన నాయకులు లేరని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. గ్రామాల మధ్య అనుసంధానమైన రోడ్లు నేలవంతెన స్థానంలో బ్రిడ్జిలు నిర్మిస్తారని ఆశతో ఉన్నారు.

రక్షణ గోడ కూడా లేదు



గ్రామం ముందు నేలవంతెన ఉంది. ఈ నేలవంతెనతో వర్షాకాలం ఇబ్బంది పడుతున్నాం. నేలవంతెనకు రక్షణ గోడ కూడా లేదు. ఈ నేలవంతెన ఆర్అండ్‌బీ రహదారిలో ఉంది.

● సుబ్బనరసయ్య,ఆర్.నాగలవరం

చాగలమర్రి వైపు వెళ్లాలంటే..



ఆలమూరు నుంచి చాగలమర్రి వైపు వెళ్లాలంటే వర్షం వస్తే ఇబ్బందులు పడాలి. పెద్దవర్షాలు కురిసినప్పుడల్లా వాగు పొంగి ప్రవహిస్తుంది. ఈ వాగులో ఒక యువకుడు కూడా వాగు దాటుతూ గల్లంతయ్యాడు. నేలవంతెన స్థానంలో బ్రిడ్జి నిర్మించాలి.

● బాషా, గ్రామస్థుడు, ఆలమూరు

రేపు సామూహిక వరలక్ష్మి వ్రతం

కొలిమిగుండ్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేట్నీకోట గ్రామంలో వెలసిన పురాతన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు గిరిస్వామి బుధవారం వెల్లడించారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు ప్రసాదం అందజేస్తామన్నారు.


కాశీ విశ్వేశ్వరస్వామి

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి: డీపీవో

ఉయ్యాలవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని నంద్యాల డీపీఈవో లలిత బాయి తెలిపారు. బుధవారం ఉయ్యాలవాడ మండల కేంద్రంలోని చిన్నవంక వద్ద ఉన్న డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన గుండంశ్రీనివాసరెడ్డి తన పొలంలో డ్రైనేజీ వెళుతూ పంటలు పండించుకోవడానికి వీలు లేకుండాపోతుందని ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. పొలం వద్ద అండర్‌డ్రైనేజీ ఏర్పాటు చేయాలని శ్రీనివాసరెడ్డి కోరడంతో అది సాధ్యమయ్యే పనికాదని ఓపెన్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించి ఎస్టిమేట్లు వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌క్రిష్ణను ఆదేశించారు. నిధుల విషయమై కలెక్టరు దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో నాగలక్షుమ్మ, గ్రామ పెద్దలు బోరెడ్డి నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీని పరిశీలిస్తున్న డీపీవో లలితాబాయి

'ఉపాధి'లో కొత్త విధానాలు అమలు

ఉయ్యాలవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో ఈనెల 15 నుంచి కొత్త విధానాలు అమలు అవుతున్నట్లు బనగానపల్లె క్లస్టర్ ఏపీడీ సాంబశివరావు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి కొత్తవిధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కొత్తగా ఆర్టిఫిషియల్ కెమెరాతో ఫొటోలు తీస్తామన్నారు. పని ప్రదేశంలో డూప్లికేషన్ విధానం లేకుండా జియోట్యాగింగ్ చేయాలన్నారు. కూలీలకు ఫేషియల్ యాప్ ద్వారా హాజరు వేయాలన్నారు. అదేవిధంగా మండలంలో వంద ఎకరాల్లో పండ్లతోటల పెంపకం చేపట్టాల్సి ఉండగా కేవలం 50 ఎకరాలు మాత్రమే చేశారన్నారు. మిగిలిన వాటికి త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు శ్రీనివాసులు, ప్రసాద్, గంగాధర్, ఉపాధి ఏపీవో హరిక్రిష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

దొర్నిపాడు సింగిల్‌విండో అధ్యక్షుడిగా సిద్ధి సత్యనారాయణ


భార్గవ్‌రామ్‌నాయుడుకు బొకే అందజేస్తున్న సిద్ధి సత్యం

దొర్నిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు సహకార సంఘం సొసైటీ సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా సిద్ధి సత్యనారాయణను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆళ్లగడ్డ టీడీపీ కార్యాలయానికి వెళ్లి టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు, టీడీపీ యువనాయకుడు భూమా జగత్‌విఖ్యాతరెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సిద్ధి సత్యనారాయణ మాట్లాడుతూ తనను సింగిల్‌విండో అధ్యక్షుడిగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఎంపిక చేయడం హర్షణీయం అన్నారు. సహకార సంఘం రైతులకు అన్ని విధాలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, చాకరాజువేముల కేసీకెనాల్ సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకట్‌నాయుడు, నీలి రామారావు, ఎండూరి గోపాల్‌నాయుడు, పగడాల రమేష్‌బాబు, కొత్త వెంకటేశ్వర్లు, జంగిటి మల్లికార్జున, బండి సుబ్బరాయుడు, శ్రీను, ఉసేని, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

తల్లిపాలు అమృతం

బనగానపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు అమృతం తో సమానమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రామేశ్వరి, చంద్రకళ తెలిపారు. బుధవారం పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలు పిల్లలకు తాపితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సీహెచ్‌వో మంజుల ఏఎన్‌ఎం, ఫకూర్‌బీ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సంజామల: ముర్రుపాలు బిడ్డ జీవితానికి వరంలాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. బుధవారం మండలంలోని పేరుసోమల - 3వ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు, ఎ.ఎన్.ఎంలు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని 14 అంగన్‌వాడీ సెంటర్లు కలిపి బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రమ్మ, కె.సుగుణమ్మ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాగించాలన్నారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మరియు ఎఎన్ఎం ఆశా వర్కర్లు, గ్రామ సచివాలయం ఎంఎస్‌కే, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.


బనగాపల్లెలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కలిసి అవగాహన ర్యాలీ చేశారు. తల్లిపాలు బిడ్డకు వరమని, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రుపాలు పట్టాలని హెచ్‌ఈ విజయభారతి తెలిపారు. బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, సుబ్బరాయుడు, ఎంఎల్‌హెచ్‌పీలు సురేంద్రబాబు, ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించకపోవడం దారుణం


చెత్తను పరిశీలిస్తున్న నాయకులు

డోన్ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శేగు థియేటర్ ఎదురుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను తొలగించకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య అన్నారు. బుధవారం సీపీఐ పట్టణ కార్యదర్శి మోటరా ముడు, మండల కార్యదర్శి నారాయణతో కలిసి ఆయన చెత్త వ్యర్థాలను పరిశీలించారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకునే అధికారులు సక్రమమైన రీతిలో పని తీరు ఉండాలన్నారు. పేరుకుపోయిన చెత్త వ్యర్థాలపై ఆకతాయిలు నిప్పు వేస్తే జరిగే పెను ప్రమాదానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే చెత్త వ్యర్థాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విష జ్వరాలు ప్రబలుతున్నాయి


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

డోన్ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పలు వార్డుల్లోని ప్రజలు విషజ్వరాలకు, అంటురోగాలకు గురవుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, నాయకులు ఎస్ఏ చిన్న రెహిమాన్, ఐద్వా నాయకురాలు షమీమ్‌బేగం అన్నారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి వారి ఆరోగ్యాలు కాపాడాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు పడుతుండటంతో పలు వార్డులలో వర్షం నీరు నిలిచి దోమలు వ్యాప్తి పెరిగి ప్రజలు విషజ్వరాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నందవరం ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి దాతలు బుధవారం విరాళం అందించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన సుబ్బారావు, లక్ష్మి నవీన దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాభివృద్ధికి రూ. 25వేల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలుకూరు ఈవోగా సతీశ్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామ ఈవోగా సతీశ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పలుకూరు గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ట్లు తెలిపారు. టీడీపీ నాయకుడు శంకర్ ఈవోను అభినందించారు.

వైసీపీ హయాంలో రైతులకు తీవ్ర అన్యాయం

కొలిమిగుండ్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు, సబ్సీడీ ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ పథకాలు అందించకుండా తీవ్ర అన్యాయం చేశారని టీడీపీ బీసీ విభాగం నాయకులు ఓబయ్యాయాదవ్ విమర్శించారు. బుధవారం కోరుమానుపల్లె, అబ్దులాపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో నాగేంద్రప్రసాదు, ఏఈవో వనిత, సిబ్బంది పాల్గొన్నారు.

డీఏ ప్రకటించాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు కరువుభత్యం (డీఏ) ప్రకటించి న్యాయం చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా అతీ గతీ లేదన్నారు. ఎన్నికల హామీ మేరకు డీఏ ప్రకటించాలని , 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం రోడ్‌మ్యాప్ ప్రకటించాలని కోరారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు ప్రాథమిక పాఠశాల, చాగలమర్రిలోని ఉర్దూ పాఠశాలలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల బుధవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల గ్రేడింగ్‌ను, సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెను ప్రకారం భోజనం తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రవీంద్రారెడ్డి, మాబుహుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బుధవారం అందజేశారు. బుధవారం మద్దూరు గ్రామానికి చెందిన సుబ్బ లక్ష్మమ్మ, లక్ష్మీదేవిలకు రూ.1.09 లక్షల చెక్కులను అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వెంకటేష్, ఓబన్న, వెంకట సుబ్బయ్య, మల్లికార్జున సుబ్బరాయుడు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

చాగలమర్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు కాని రైతుల వివరాలను సేకరించాలని అన్నారు. ఆధార్, బ్యాంకు వివరాలను అప్‌లోడ్ చేసి తిరిగి అర్హులుగా చేసేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్ సత్తార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

9న వేంకటేశ్వరస్వామి కల్యాణం

చాగలమర్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో 9న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిసున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులతో కల్యాణం, పల్లకి ఉత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

10న మండల సర్వసభ్య సమావేశం

చాగలమర్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో 10న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.